# యౌవనుడా!! యేసయ్యకు నీవే కావాలి!!!

## దేవునికి నీవు ప్రత్యేకమైనవాడవు

ఒక ప్రసంగీకుని మాటలు వింటున్నప్పుడు. నేనట్లా ప్రసంగించలేక పోతున్నానే? ఒక సింగర్ పాడుతున్నప్పుడు, నేనట్లా పాడలేకపోతున్నావే? ఒక మ్యుజిషియన్ వాయిస్తున్నప్పుడు, నాకట్లాంటి నైపుణ్యములేని లేవే?... అంటూ వాళ్ళనీ వీళ్ళనీ పోల్చుకొని క్రుంగిపోయేవారు కొందరైతే? వాళ్ళనీ వీళ్ళని పోల్చుకొని వారికున్న తలాంతులను చూచి పొంగిపోయేవారు మరి కొందరు. ఎవ్వరితోనూ నీవు పోల్చుకోనవసరం లేదు. ఎందుకంటే? నీలాంటి వారు ఈ లోకంలో ఎవ్వరూ లేరు. ఒక తల్లికి పుట్టిన కవలలో కూడా చెప్పలేనన్ని వ్యత్యాసాలు. నీకు నీవే ప్రత్యేకం. నిన్ను ప్రత్యేకంగా దేవుడు సృష్టించాడు.  నీ పట్ల ఒక ప్రత్యేకమైన ప్రణాళికను కలిగియున్నాడు. అట్లాంటప్పుడు? నేను చేతకానివాడిని, చేతకానిదానను అంటూ ఎందుకు క్రుంగిపోతున్నావ్?

## బలహీనులను వాడుకునే దేవుడు

“ఏ శరీరియు దేవుని యెదుట అతిశయింపకుండునట్లు, జ్ఞానులను  సిగ్గుపరచుటకు లోకములోనుండు వెఱ్ఱివారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. బలవంతులైనవారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు.ఎన్నికైన వారిని వ్యర్థము చేయుటకు లోకములో నీచులైనవారిని, తృణీకరింప బడినవారిని, ఎన్నికలేనివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు”.1 కొరింది 1:27-29; దేవుడు నిన్ను వాడుకోవడానికి నీకున్న జ్ఞానం, నీకున్న తలాంతులే కారణం అనుకోవడం అవివేకం. నీకు ఆరోగ్యంవున్నా - లేకున్నా, చదువున్నా లేకున్నా, బాస్ వి అయినా - సాతానుకు బానిసవైనా, మాటకారివైనా నత్తి వాడవైనా,చిన్న వాడవైనా-పెద్ద వాడవైనా, నీస్థితి ఏదయినా సరే 'నీవు ఆయనకు కావాలి'. షోమ్రోను పట్టణం ఆకలితో అల్లాడిపోతున్నప్పుడు, వారి ఆకలిని తీర్చడానికి దేవుడు "కుష్టురోగులను" ఏర్పాటు చేసుకున్నాడు. 2 రాజులు 7:9; ఇజ్రాయేలీయులు, ఐగుప్తు దాస్యములో మ్రగ్గిపోతున్నప్పుడు, వారిని విడిపించడానికి "నత్తివాడైన" మోషేను నాయకుడిగా దేవుడు ఏర్పాటు చేసుకున్నాడు. నిర్గమ 4:10 ఐదు వేలమంది ఆకలిని తీర్చడానికి 'చిన్నవాడు' తెచ్చిన 'చిన్న ఆహారము'నే ప్రభువు వారు వాడుకున్నారు. యోహాను 6:9; సైన్యాధ్యక్షుడైన  నయమాను కుష్టురోగము బాగుపడడానికి బానిసయైన 'చిన్నది' ఇజ్రాయేలు దేవుని శక్తిని గూర్చి ఇచ్చిన సమాచారమే

కారణమయ్యింది. 2 రాజులు 5:4; యుద్ధ శూరుడైన గొల్యాతును సంహరించడానికి 'బాలుడైన' దావీదును, 'ఒడిసెలు' ను ఆయుధంగా ఎన్నుకున్నాడు. 1 సమూయేలు 17:33 యేసు ప్రభువు వారు తన రాజ్య సువార్తను వ్యాప్తి చెయ్యడానికి చేపలపట్టు 'జాలరులను' తన శిష్యులుగా ఎన్నుకున్నాడు. మత్తయి 10:2; యేసు ప్రభువు వారు తన ప్రయాణానికి హేరోదు గుర్రాలను కాదు వాడుకున్నది. కట్టబడిన 'గాడిదపిల్ల' ఆయనకు కావలసి వచ్చింది. మార్కు 11:2;

## నీవే ఆయనకు కావాలి

అవును! సాతాను కట్లచే బంధించబడిన నీవే ఆయనకు కావాలి. నీకు నీవే తగ్గించుకొని, నావల్ల ఏమి కాదని, దేవునికి నేను పనికిరానని చెప్పి, దేవుని పని చెయ్యకుండా తప్పించుకొనే ప్రయత్నం చెయ్యొద్దు. ప్రసంగాలు చేస్తూ, పాటలు పాడుతూ, ఇంకా ఏవోవో చేస్తూ దేవునికి దూరంగా జీవించే వారికంటే, ఆయనకోసం జీవించాలనే ఆశను కలిగియున్న 'నీవే ఆయనకు కావాలి'. నిజంగా నీవే ఆయనకు కావాలి!! ఆయన కోసం వాడబడడానికి సిద్ధపడదాం! ఆరీతిగా మన జీవితాలను సిద్ధ పరచుకుందాం! అట్టి కృప, ధన్యత దేవుడు మనకు అనుగ్రహించునుగాక! ఆమెన్! ఆమెన్! ఆమెన్!